క్లుప్తంగా

రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మధు



అధ్యక్షుడిగా విజయం సాధించిన మధుతో కాలనీ వాసులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రామ కృష్ణ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కె. మధు విజయం సాధించారు. ఆదివారం హోరాహోరీగా జరిగిన సొసైటీ ఎన్నికల్లో కాలనీ వాసులు పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. జనరల్ సెక్రటరీగా మధు, కోశాధికారిగా టి. రాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన కె. మధు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించినందుకు కాలనీ వాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీల కతీతంగా కలుపుకొని కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాచర్ల భద్రయ్య, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ బుచ్చయ్య, కార్యనిర్వహణాధికారి సుధాకర్ తదితరులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లో శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా బాలభోగం, ద్వారా తోరణ, ధ్వజ కుంభారాధనం, మూలమంత్ర ఆహ్వానం, బలిహరణం, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణం, శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణం అనంతరం భక్తులకు మహా అన్నదానం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, ప్రధాన వీధుల్లో శ్రీవారి పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్ మహేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక కమిటీ చైర్మన్ బాకారం బుచ్చయ్య, సభ్యులు అనూపమ, జై నర్సింలు, జి. రామకృష్ణారావు, డి. జనార్దన్ గౌడ్, పి. మల్లికార్జునరెడ్డి, నాగేశ్వరరావు, అనిల్‌కుమార్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు సురేంద్ర ముదిరాజ్ తదితరులు

మోతీనగర్: రాబోయే రోజుల్లో జీహెచ్ఎంసీ పరిధిలో జరిగే కార్పొరేటర్ ఎన్నికల్లో ప్రతి రాజకీయ పార్టీ ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం జీహెచ్ఎంసీ నగర అధ్యక్షుడు సురేంద్ర ముదిరాజ్ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ ముదిరాజ్ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం వివేకానందనగర్ కమిటీ హాల్‌లో అధ్యక్షుడు గడ్డమీది రవీంద్ర ముదిరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లందరు ప్రతి బస్తీ, కాలనీలో చేపట్టే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముదిరాజ్‌లకు చేరే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి దారబోయిన శ్యామ్ ముదిరాజ్, నాయకులు ముదుపు జితేందర్, గోనెల సుదర్శన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సుభాష్‌నగర్: సుపరిపాలన అందించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత రెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ మిథిలానగర్‌లో రూ. 13 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తున్నామని తెలిపారు. డ్రైనేజీ లైన్, సీసీ రోడ్డు పనులు పూర్తి కావడంతో మిథిలా నగర్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించబడ్డాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే మట్టికుప్పలు..

వాహనదారులకు తప్పని తిప్పలు!

ఎక్కడో తవ్విన సెల్లార్‌మట్టిని, భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్డుకు ఇరువైపులా కుప్పలు పోస్తున్నారు. అసలే ఇరుకు రోడ్డు కావడంతో ఉదయం, సాయంత్రం రద్దీ ప్రాంతం కావడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మట్టి కుప్పలతో రోడ్డు చిన్నగా అవ్వడంతో పాటు రాళ్లు, రప్పలు రోడ్డుపై పడుతుండటంతో వాహనాలు జారిపడి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. పలు మార్లు ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.



- నిర్మాణ వ్యర్థాలతో వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం
- రాత్రిపూట డంప్ చేస్తున్న అక్రమార్కులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

> **మట్టి కుప్పలను తొలగించాలి**
>
> 
>
> రాత్రి సమయంలో రోడ్డుకు ఇరువైపులా భవన నిర్మాణ వ్యర్థాల కుప్పలు పోస్తున్నారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. మట్టి కుప్పలపై చెత్తా చెదారం కూడా పేరుకుపోతుంది. ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మట్టి కుప్పలు తొలగించడమే కాకుండా మట్టికుప్పలు పోయకుండా చర్యలు తీసుకోవాలి. – సతీష్, జింకలవాడ





నాలా వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టికుప్పలు, నిర్మాణ వ్యర్థాలు

మూసాపేట: జింకలవాడ నుంచి దీన్‌దయాల్‌నగర్ నాలా వరకు రోడ్డుకు ఇరువైపులా మట్టి కుప్పలు ఎక్కువగా ఉన్నాయి. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని జింకలవాడ నుంచి దీన్‌దయాల్ నగర్ నాలా మీదుగా బాలానగర్‌కు రాకపోకలు రద్దీగా ఉంటాయి. ఈ రూట్‌లో నాలా మలుపు వరకు రోడ్డు ఇరుకుగా ఉంటుంది. నిత్యం రోడ్డుపై మట్టికుప్పలు పోస్తూ ఉండటంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి కుప్పల్లో ఉన్న రాళ్లు, రప్పలు రోడ్డు పైకి రావడంతో వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. మూసాపేట, భరత్‌నగర్, హెచ్‌పీ రోడ్డు వాసులు బాలానగర్‌కు వెళ్లాలన్నా ఇదే దారిని ఆశ్రయిస్తుంటారు. బాలానగర్ నుంచి రావాలన్నా ఇదే దారిలో త్వరగా భరత్‌నగర్, మూసాపేటకు చేరుకోవచ్చు. అయితే కార్లు అధికంగా వస్తే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. కొన్ని నెలలుగా సెల్లార్‌లో తవ్విన మట్టిని, భవన నిర్మాణ వ్యర్థాలను రాత్రి సమయంలో తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. జింకలవాడ నుంచి దీన్‌దయాల్ నగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా మట్టిని కుప్పలు, కుప్పలుగా పోస్తున్నారు. నెలలు గడిచినా మట్టికుప్పలు అలాగే ఉంటున్నాయి. దీనికి తోడు మట్టి కుప్పలపై పలువురు చెత్తా చెదారాన్ని వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరు వైపులా ఉన్న నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని, డంప్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాగంటి గోపీనాథ్ మరణం బాధాకరం

- పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ



ఆల్విన్‌కాలనీ: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో మరణించారన్న వార్త తీవ్రంగా బాధించిందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆయన లేని లోటు తీరనిదని, మాగంటి కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు. వారి కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ముందుకు సాగాలని కోరారు. రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన వారి జీవితం ఎంతో మందికి ఆదర్శం అని అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి నిత్యం ఎనలేని కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.

మాగంటి మరణం తీరనిలోటు

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: తోటి స్నేహితుడు, అత్యంత ఆప్తుడు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం పేర్కొన్నారు. 30 ఏళ్ల నుంచి రాజకీయాల్లో మేమిద్దరం కలిసి పని చేశామని గుర్తు చేశారు. నిరుపేదల గురించి ఆలోచించే వ్యక్తి అని స్మరించుకున్నారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను వేధించిన సందర్భంలో కూడా ఆయన తీవ్ర మనస్థాపానికి గురయ్యారని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు.

ముందస్తు రేషన్ కష్టాలు !



క్యూలో సంచులపై రాళ్లు పెట్టిన దృశ్యం



నిలబడలేక కూర్చొని ఎదురు చూస్తున్న కార్డుదారులు

మూసాపేట: మూడు నెలల రేషన్ తీసుకునేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో కార్డుదారుడు బియ్యం తీసుకునేందుకు సుమారు అరగంటకు పైగా సమయం పడుతుండటంతో ఒక్క రోజులో తక్కువ మందికి బియ్యం అందజేస్తున్నారు.దీంతో ఎన్నో రోజులు బియ్యం కోసం వచ్చి తమ వంతు వచ్చేసరికి రేషన్ షాపు మూసివేస్తుండటంతో ప్రజలు సంచులను క్యూ లైన్‌లో పెట్టి వెళ్తున్నారు. సంచులు గాలికి ఎగిరిపోకుండా వాటిపై రాళ్లను పెడుతున్నారు. ఎండలో ఉండలేక నీడ ఉన్న ప్రాంతాలను వెతుక్కొని ఎదురు చూస్తున్నారు. ఉదయం 8 గంటలకు షాపు తెరిస్తే 6:30 గంటల నుంచే క్యూ లైన్లు ప్రారంభమవుతున్నాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచే క్యూలైన్‌లో నిరీక్షించి మూసాపేటలోని పలు రేషన్ దుకాణాల్లో రేషన్ బియ్యం తీసుకుంటున్నారు.

30 వరకు సన్న బియ్యం పంపిణీ

డీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: మూడు నెలలకు ఒకేసారి సరిపడా సన్న బియ్యం పంపిణీ ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమం ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని లబ్ధిదారులు కంగారు పడొద్దని అన్నారు. ఈ విషయాన్ని రేషన్ కార్డు దారులు గమనించాలని డీఎస్ఓ పేర్కొన్నారు.

ఆలయంలో సుదర్శన హోమం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుదర్శన, నరసింహ, లక్ష్మి ధన్వంతరి హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి రామాచారి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతల్: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ప్రాణధార సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో డయాబెటీస్, బీపీ, గుండె సంబంధిత ఈసీజీ, ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అదే విధంగా గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో ఎస్.ఎస్.కె పట్కార్ ఖాత్రి సమాజ్ ఆధ్వర్యంలో 130 మందికి జరిగిన సామూహిక ఉపనయనంలో భరతసింహారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో వీరారెడ్డి, నార్లకంటి ప్రతాప్, పెద్దింటి సాయిలు, సందీప్ గౌడ్, శ్రీనాథ్, శ్రీకాంత్ రెడ్డి, మహేష్ గౌడ్, మహేష్, ఈశ్వర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్లు కిటకిట

మృగశిర కార్తెతో ఉదయం నుంచే బారులు తీరిన కొనుగోలుదారులు





చేపల కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్

నిజాంపేట్: ప్రతి సంవత్సరం మృగశిర కార్తె పర్వదినం ప్రజలకు ఓ పండుగవలె ఉంటుంది. ఈ రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని ప్రజల విశ్వాసం. ఉబ్బసం, ఆయాసం ఉన్న వారికి ఈ చేపలు ఎంతో మంచిదని పెద్దలు చెబుతుంటారు. ఆదివారం మృగశిర కార్తె సందర్భంగా పలు చేపల మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడాయి. చేపల మార్కెట్‌కు మృగశిర కార్తె సందర్భంగా వందలాది రకాల చేపలు రావడంతో విక్రయదారులతో మార్కెట్‌లన్నీ కళకళలాడాయి. మార్కెట్‌కు పెద్ద ఎత్తున చేపలు దిగుమతి అయినా కూడా ధరలు ఏమాత్రం తగ్గలేదు. గత ఏడాదికన్నా మరింత పెరిగాయి. రవ్వ, బొచ్చ, కొర్రమీను, టంటం, పాంప్లెట్, బంగారు తీగ వంటి పలు రకాల చేపలతో పాటు రొయ్యలు, పీతలు దిగుమతి అయ్యాయి. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున చేపలు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు.

సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు ముందుండాలి



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలు పరిష్కరించేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొంపల్లిలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా సమావేశం జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు. నేడు దేశం మొత్తం ప్రధాని మోదీ పాలన గురించే చర్చించుకుంటోందని, ఆయన తీసుకున్న వీరోచిత నిర్ణయాలతో విదేశాలు సైతం నివ్వెరబోయాయన్నారు. గతంలో పాలన చేసిన బీఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాల తీరుపై రాష్ట్ర ప్రజలు విసుగు చెందారని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఓబీసీ ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రాష్ట్ర మాజీ బీసీ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కొంపల్లి అధ్యక్షుడు సతీష్‌సాగర్, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న హిందువులు



నిజాంపేట్: 352వ హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. భారతదేశంలో హిందువులందరూ అరబ్, మొగల్ మతోన్మాద ఇస్లాం పాలకుల దారుణాలకు దిక్కుతోచని స్థితిలో ఉండేవారని నాయకులు అన్నారు. అలాంటి పరిస్థితిలో ఒక ఆశాకిరణంలా జన్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందూ మహా సామ్రాజ్య పట్టాభిషేకం జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి రోజును హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రగతినగర్ కోతి బొమ్మల సెంటర్ నుంచి వివిధ రహదారుల గుండా శోభాయాత్ర జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ ఎమ్.ఆర్.రాజు, మధుజీ, కంతేటి సుబ్బారావు, సత్య కాటేపల్లి, రచ్చ చక్రధర్, లక్ష్మీ రామారావు, భిక్షపతి యాదవ్, శేషారావు, నరేంద్ర చౌదరి, శ్రీనివాస్‌గుప్తా, దాసి నాగరాజు, భారతి, శిల్ప, కల్యాణి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం







ఆల్విన్‌కాలనీలో ..



వివేకానంద నగర్ డివిజన్‌లో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వద్ద..

ఆల్విన్‌కాలనీ: మ్యాన్‌హోల్స్‌తో ప్రమాదం పొంచి ఉంది. మూతలు లేకుండా, శిథిలావస్థకు చేరుకున్న మ్యాన్‌హోల్స్‌తో ప్రజలు భయపడుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో పలు కాలనీలు, బస్తీల్లో మ్యాన్‌హోల్స్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో వాహనదారులు మూతలు లేని మ్యాన్‌హోల్స్‌లో పడి గాయాలపాలవుతున్నారు. వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో వర్షాలు కురిస్తే ఎక్కడ మ్యాన్‌హోల్ ఉందో తెలియని పరిస్థితి. మ్యాన్‌హోల్స్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదని స్థానికులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ ప్రాంతాల నుంచి రాకపోకలు జరుగుతున్న క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ, ఫేజ్ -1, ఫేజ్ -2, పంచమి కాలనీ, ఎల్లమ్మ బండ, ఆస్‌బెస్టాస్ కాలనీ, రిక్షాపుల్లర్స్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, జయానగర్, హైదర్‌నగర్ ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ నోర్లు తెరుచుకున్నా యి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పటిష్టంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.